# చెల్లాయి

రచయిత్రి :
కస్తూరీబాయి

కుర్చీలో కూర్చొని యేదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నారు. మొగం ఆవైపు తిరిగివుంది. మనిషి చాలా విచారంగా వున్నట్లు వున్నారు. మాకేమీ తోచలేదు. రూమంతా సిగరట్టు పేకలమయంగా వుంది. మావారు బలవంతంచేస్తేనేతప్ప సిగరట్లు కాల్చరే! ఏమిటీ వింతమార్పు అనుకున్నా నేను. నాదృష్టి యింతలో రూములో ఒక మూలవున్న ఒక చిన్న ఫోటో స్టాండుమీదికి పోయింది. ఫోటోకు పువ్వులు ఒత్తుగా పెట్టివున్నాయి. నేను వెంటనే ఆ ఫోటో దగ్గరకు వెళ్లాను. అప్పుడు మోహన్ గారు "ఎప్పుడొచ్చావు చెల్లాయి! కూర్చో" అని కుర్చీలో నుంచి లేచారు కళ్ళనీళ్లు తుడుచుకుంటూ. మోహన్ గారి విచారానికి కారణం నాకు కొంచెం అర్థమయింది.

"ఎవరండీ యీ ఫోటో! అంతా నాకుమల్లేనే వుంది" అన్నాను.

"మా చెల్లెలండీ" అన్నారు.

"పేరేమిటండీ?" అన్నాను వెంటనే.

"సుశీల" అని పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నారు. నాకు దుఃఖమొచ్చింది వారా స్థితిలోవుండటంచూచి.

"ఇప్పుడెక్కడున్నారండీ?" అన్నాను.

దుఃఖం మరీ యెక్కువయింది. చిన్నపిల్లాడిలాగు వెక్కి వెక్కి యేడుస్తూ "యెక్కడన్నావుంటే యింకేమిటండీ" అన్నారు అనలేక అనలేక.

ఇంతలో మావారు "యేమిటోయి బ్రదర్! ఇంత చిన్నవాడివయిపోతున్నావు మరీని" అని సానుభూతిగా మాట్లాడి కొంతవరకు వోదార్చగలిగారు.

దుఃఖాన్ని దిగమ్రింగి మోహన్ నెమ్మదిగా దీనంగా చెప్పటం మొదలుపెట్టాడు:

"మా చెల్లెలిని నా స్నేహితుడికే యిచ్చి పెళ్ళిచేశానోయి. అతను నేనూ ఒక్కస్కూల్లో చదివేవాళ్ళం. చాలా అన్యోన్యంగా వుండేవాళ్ళం కూడాను. మాస్నేహం బంధుత్వంగా మారిన దగ్గఱ నుంచీ అత్తారింటికాడ అల్లుడుచేసే ఆగడాలు సాగించాడు. సరేలే అది సర్వసామాన్యమేగదా, గడియారం కొనిపెట్టమనీ, సైకిలు కొనిపెట్టమనీ, పండగలకి డబ్బనీ అనటం అని నేను మామూలుగానే వుండేవాడిని. ఏది కావాలన్నా సమకూరుస్తూనే వుండేవాడిని" ఈ మాటలు చెప్పి, ఫోటోవంక వోసారిచూసి కొంతసేపు మళ్ళీ నిశ్శబ్దంగావున్నారు. మేమిద్దరంకూడా చాలా నిశ్శబ్దంగా యేమి చెపుతారో అని కూర్చున్నాము.

"తరవాత మేమిచ్చిన డబ్బుతోనూ, యింకా అక్కడా యిక్కడా అప్పులుచేసి సానివాడకు అలవాటుపడ్డాడు. ఎప్పుడో వారానికో పదిహేను రోజులకో యింటికిరావడం మా చెల్లెల్ని బెదిరించో, ఆదరించో పెట్టెలోడబ్బు తీసుకురమ్మని మళ్ళీ యథాప్రకారంగా వెళ్ళటం జరిగేది. ఇది జరిగేటప్పటికి నేను గుంటూరులో చదువుతూవుండేవాడిని. శెలవులకు యింటికివెళ్ళితే యీగోలంతా చెవినిపడుతూ వుండేది. కొంతకాలానికి పెట్టెలో డబ్బు లేకపోయేది నేను గుంటూరులో వుండటంతో. ఒకరోజున చేతిగాజులు లాక్కుపోయాడట. 'కారు కొన్నాను—డబ్బు తక్కువయిందని'...యీవిషయం దశరా శెలవులకు యింటికివెళ్ళితే మా తాత చెప్పాడు. మా చెల్లెలుమాత్రం నాతో ఒక్క మాటకూడా చెప్పేదికాదు. విషయం అంతా తెలిసి

నాకా మళ్ళా అడిగి మనసు కష్టపెట్టటం యెందుకని నేనూ అడిగేవాడిని గాదు. నేను యింటికాడ వున్నప్పుడుమాత్రం సక్రమంగానే వుండేది వ్యవహారం. నాతో బాగానే వుండేవాడు. నేను పరీక్షలు మార్చిలో అయిపోగానే యింటి వెళ్ళాను. మేము కట్నంగా యిచ్చినపొలం తనపేర వ్రాయాలి, లేకపోతే వీల్లేదు అని మధ్యవర్తులచేత కబురు పంపించాడు. మా చెల్లాయి బిక్కమొగం వేసింది. సరే కానియ్యి—వ్యవహారం యింతదాకా వచ్చిందిగదా మనలోపమెందుకుండాలి అని రిజిస్టరు చేయించాను పొలం. మర్నాడు యింటికి పంపించవలసిందని వెంటనే కబురు. అంత హటాత్తుగా యేర్పాట్లు యేమీలేకుండా యెలా పంపించడం. ఎలాలేదన్నా రెండువందలన్నా లేంది యెలా పంపించటం. ఎంత అన్నా వందలకొద్దీ పెట్టెలో వుంటయ్యా? సరే యెక్కడో చేబదులు తెచ్చి పంపించొచ్చాను. చెల్లాయి యెక్కడ మనసు నొచ్చుకుంటుందో అని నాచేతనైనంత చేసేవాడిని. అప్పటికే మనిషి కొంచెం నీరసంగావుంది. విచారాలు వరుసగా వచ్చేటప్పటికల్లా మనిషి సగమయిపోయింది. ఇక చూస్తే లాభంలేదని మళ్ళీ యింటికి తీసుకొచ్చాను. మొదట్లో తీసుకెళ్ళటానికి వీలులేదన్నాడు. తర్వాత వాళ్ళువీళ్ళు కేకలేస్తే వూరుకున్నాడు. దగ్గఱ బస్తీలో డాక్టరును కుదిర్చాను. నెత్తురు బాగా పట్టాలి. ఇంజక్షన్లు యివ్వాలి అన్నారు డాక్టరు. సరేనని డబ్బు మాట్లాడి వారానికి ఒకసారి చెల్లెల్ని తీసుకెళ్ళి ఇంజక్షన్లు యిప్పించేవాడ్ని. నేను రోజూ సైకిలువేసుకొని మందు తెచ్చేవాడిని.

ఇలా రెండుమూడు వారాలు జరిగేటప్పటికల్లా యింట్లో రాక్షసితల్లి యేమిచెప్పిందో మందుల ముండ యీ డాక్టరు మంచివాడు కాదు, మాచుట్టం బందరులో వున్నాడు. అవుసరంలేదు. ఈ డాక్టరు యం. బి. బి. యస్. ప్యాసయినవాడే అన్నాను.

వీల్లేదంటే వీలులేదన్నారు.

ఒకరోజున నేను లేకుండాచూసి వస్తావా రావా అని కూర్చున్నాడుట. మా చెల్లెలికి వాడంటే తిరుగులేదు. ఏమిచేస్తుంది, బయలుదేరింది. మా అమ్మ కూడా వెళ్ళిందట. కన్నకూతుర్ని యెలా విడిచుంటుంది. నేను వారానికి ఒకసారి వాడు లేనప్పుడు వెళ్ళి చూచి కావలసిన డబ్బూ, నెయ్యీ ఆదీయిచ్చి వచ్చేవాడిని. నేను కనబడ్డాకూడా మాట్లాడేవాడు కాడు మాబావమరిది. ఒకసారి డాక్టరు దగ్గర యిద్దరం తారసిల్లాము. నేను డాక్టరుని కేసునుగురించి అడిగితే "యేమీ ఫరవాలేదు. విశ్రాంతి కావాలన్నాడు. సరేనని నేను యింటికొచ్చాను. బావమరిదికూడా నేనువచ్చిన మర్నాడే వూళ్ళోకొచ్చాడు. సరిగా నేను బందరునుంచి వచ్చిన వారం రోజులకు

ధాతుపుష్టియు, శక్తివర్ధకమగు

బంగామృతవటి

ధాతుక్షీణత, మలబద్ధకము, స్వప్నస్ఖలనము వీటికి ఉత్కృష్టమైన గుణమును ఇచ్చును. ఇవి రక్తమును, వీర్యమును, అధికపరచి దేహమునకు క్రొత్తఉత్సాహం కలిగించును.

40 మాత్రలుగల బుడ్డి 1-కి రూ॥ 3.

నపుంసకత్వారి ఘృతము

ఈ ఘృతమును పురుషలింగముపై రుద్దుటచే, శిథిలమైన నరములకు దారుఢ్యమొసగి, వక్రత, శిథిలత మొదలగువాటిని పరిహరించి శాశ్వతమైన పురుషత్వము ఏర్పడును. వెల రూ. 1.

మదనమంజరి ఫార్మసీ,

184, చైనాబజారురోడ్డు, మదరాసు.

బెజవాడ:-శ్రీనివాస మెడికల్ స్టోర్సు, పార్కురోడ్డు.

విశాఖపట్టణము:-నీలము అండ్ కో., మెయిన్‌రోడ్డు.

కాకినాడ:-లక్ష్మీనారాయణ అండ్ కో., మెయిన్‌రోడ్.

బందరునుంచి అర్ధరాత్రికాడ మనిషొచ్చాడు చాలా సీరియస్‌గావుంది అని. మా బావమరిదేవచ్చి కేకేశాడు. మాట్లాడకుండా మాతాత వాళ్ళతో హడావిడీ పడొద్దని చెప్పి, వచ్చినమనిషీ, నేను, యితనూ ముగ్గరం ఆ వచ్చిన జట్కాలోనే గుడివాడవెళ్ళి అక్కడనుంచి టాక్సీ మాట్లాడుకుని బందరు వెళ్లేం. వెళ్లేటప్పటికే మా అమ్మ యేడుస్తూ మాచెల్లెలి మంచంమీద కూర్చొనివుంది. ఇంకా ప్రాణంవుంది. వెంటనే కారులో గుడివాడ తీసుకొచ్చి మళ్ళీ డాక్టరుకు చూపిస్తే "ఇదేం గారడీ అనుకున్నారా? ఇంతకాలంనుంచీ జబ్బుగావుంటే అర్ధరాత్రి తీసుకువచ్చి చూడమంటే యేమిలాభం" అన్నాడు. సరే యిక యేడుస్తూ కారులో యింటికి తీసుకొస్తుండగా మావూరు యిక నాలుగు ఫర్లాంగులుండగా ప్రాణం పోయింది. మా అమ్మమ్మ, చిన్నచెల్లాయి, మా తాత చెల్లెల్ని ఆఖరుసారి కంటిలో చూడటానికైనా నోచుకోలేదు.

కిరాతకుడు నమ్మి స్నేహితుడుగదా అని చెల్లాయినిస్తే ప్రాణంతీశాడు.

సరిగా మా చెల్లాయి సుశీల మమ్మల్ని వదలిపెట్టి యివ్వాళకు సంవత్సరం అయింది" అని చెప్పి మోహన్ వెక్కి వెక్కి యేడ్వటం ప్రారంభించాడు. ఫోటోను హృదయానికి హత్తుకున్నాడు. మాకుకూడా యీ విషాద సంఘటననుగూర్చి విన్న తర్వాత దుఃఖం ఆగలేదు. మేమలాగా వుండిపోయేం.

గడియారం పన్నిండుగంటలు కొట్టిన శబ్దం వినపడింది. అయినా యింటికి వెళ్ళటానికి మనస్సు పుట్టలేదు. ఆ విచార సాగరంలో మోహన్‌ను వదలి వుండలేకపోయాం. ఆ రాత్రంతా మోహన్‌ని ఓదారుస్తూ గడిపాం. పాపం! మోహన్ హృదయం యెంత పరితపిస్తోంది చెల్లాయి సుశీలకోసం.

వైద్యరత్న.
పండిత.డి.గోపాలాచార్యులవారి.
జీవామృతము
కండపుష్టికి,
వీర్యవృద్ధికి,
జవసత్వములకు
ప్రసిద్ధిగాంచిన
వాజీకరరసాయనము.
ఆయుర్వేదాశ్రమము, మద్రాసు.